సీహెచ్‌సీకి దిక్కెవరు..?

- సరైన సమయంలో అందని చికిత్స
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రోగులు
- మాత్రలిచ్చి పంపిస్తున్న స్టాఫ్ నర్సులు



గాంధారి సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం కోసం వేచిఉన్న రోగులు

గాంధారి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో ఉన్న సామాజిక ఆరోగ్యం కేంద్రంలో పరిస్థితులు ఇష్టారాజ్యంగా మారాయి. 15 రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల ప్రజలు రోగాల బారిన పడ్డారు. దీంతో వారు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారు. ఆసుపత్రిలో ఇద్దరు వైద్యులను నియమించినప్పటికీ ఒక్కరు కూడా అందుబాటులో ఉండట్లేదు. గత సోమవారం వివిధ గ్రామాల నుంచి రోగులు ఆస్పత్రికి రాగా వైద్యుడు విధుల్లోకి రాలేదు. కాని మరో మహిళా వైద్యురాలు మాత్రం సీహెచ్‌సీలో రోగులు అధికంగా ఉన్నారని చూసి మధ్యలోనే సీహెచ్‌సీ నుంచి వెళ్లిపోయారని రోగులు పేర్కొన్నారు. కొందు రోగులు తమకు వైద్యం చేసి వెళ్లాలని కోరినప్పటికీ మరో వైద్యుడు వస్తారని చెప్పి వెళ్లిపోవడంతో రోగులు విస్తుపోయారు. ఇక విధుల్లో ఉన్న హెడ్ స్టాఫ్ నర్సు పద్మిని, నర్సులు జాన్సీ, సుహాసిని రోగులకు మాత్రలిచ్చి పంపించారు. అయితే మంగళవారం స్పెషలాఫీసర్ బావయ్య, ఎండీవో రాజేశ్వర్‌తో కలిసి సీహెచ్‌సీని సందర్శించారు. వైద్యులు సమయపాలన పాటించాలని, సీజనల్ వ్యాధుల దృష్ట్యా అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

చర్యలు తీసుకోవాలి



గత సోమవారం వైద్యురాలు తమకు వైద్యం చేసి వెళ్లాలని కోరినా మరో వైద్యుడు వస్తారంటూ వెళ్లిపోయింది. ఆమె ఆస్పత్రి కి ఎందుకు వచ్చిందో..ఎందుకు వెళ్లిదో కూడా అ ర్థం కాలేదు. సుమారు 50 మంది రోగులు వేచిఉన్నప్పటికీ ఆమె ఆస్పత్రి నుంచి వెళ్లిపోయింది.

– కాశీరాం, గాంధారి

3 రోజులుగా తిరుగుతున్నాం



కాళ్లు చేతులు నొప్పిగా ఉన్నాయని, జ్వరం వస్తుందని గత శనివారం నుంచి ఆస్పత్రికి తిరుగుతున్నం. మందు గోలీలు ఇచ్చి పంపుతున్నారు. ఏమి తగ్గడం లేదు. గ్లూకోజ్‌లు పెట్టమంటే పెడ్తలేరు. రోగులను నిర్లక్ష్యం చేస్తున్నారు.

– ఎల్లయ్య, చెన్నాపూర్

ఇంట్లో అందరికీ జ్వరాలే..



మాది మాతు సంగెం తండా. మా ఇంట్లో అందరికీ జ్వరం వస్తుంది. మా నాన్న సోమ్లా, మా భార్య శారదతో కలిసి ముగ్గురం వైద్యం కోసం వచ్చాం. కాని డాక్టరమ్మ రోగులను చూడకుండానే వెళ్లిపోయింది. దవాఖానాల ఉన్న వాళ్లు మందు గోలీలు ఇచ్చి పంపిస్తుంన్రు.

– హేమ్‌సింగ్, మాతుసంగెం తండా

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మాట్లాడుతున్న సంక్షేమశాఖ అధికారి బావయ్య

గాంధారి(ఎల్లారెడ్డి) : బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని కామారెడ్డి జిల్లా సాంఘిక సంక్షేమాధికారి, మండల ప్రత్యేకాధికారి బావయ్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఓ ఫంక్షన్ హాల్లో ఎల్లారెడ్డి సీడీపీవో సరిత ఆధ్వర్యంలో గాంధారి, ఎల్లారెడ్డి, లింగంపేట్, నాగిరెడ్డిపేట్ మండలాల అంగన్ వాడీ కార్యకర్తలతో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్‌తో కలిసి ప్రత్యేకాధికారి హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌రెడ్డి తదితరులున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయానికి జీపీ కార్యాలయాల నుంచి రావాల్సిన బకాయిలను చెల్లించాలని గ్రంథపాలకుడు రాజలింగం కోరారు. ఈ విషయమై బుధవారం తాడ్వాయి మండల పరిషత్‌కార్యాలయంలో ఎంపీవో సవితారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలోని అన్ని జీపీ కార్యాలయాలు ఇళ్ల వినియోగదారుల నుంచి వసూల్ చేసిన బిల్లుల నుంచి 8శాతం గ్రాంటును గ్రంథాలయానికి చెలించాల్సి ఉంటుందన్నారు.18గ్రామపంచాయతీలకు గాను గ్రంథాలయానికి రూ.10 లక్షలకుపైగా బకాయిలు రావాల్సి ఉందన్నారు.

బోరు మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : రైతులు వారి బోరు బావుల వద్ద కెపాసిటర్లు అమర్చుకోవాలని విద్యుత్ శాఖ డీఈ విజయసారథి అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి మండలంలో నిర్వహించిన పొలంబాట కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు బోరుమోటార్ల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్ల మీద లోడ్ పడకుండా మోటార్లు నాణ్యతగా పని చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ సత్యనారాయణగౌడ్, లైన్ మెన్లు కమృద్దిన్, సిబ్బంది ప్రేమ్ ఉన్నారు.

పాఠశాలల తనిఖీ



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం, అవుసుల తండా గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఎంపీడీవో గంగాధర్ తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, మూత్రశాలలు, మరుగుదొడ్ల పరిస్థితి, గదుల కొరతను టీచర్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు, పంచాయతీల కార్యదర్శులున్నారు.

బదిలీపై వెళ్లిన ఏవో, ఏఈవోలకు సన్మానం



కామారెడ్డి రూరల్ : మండలంలోని చిన్నమల్లారెడ్డి రైతు వేదికలో పాల్వంచ మండల ఏవోగా బదిలీపై వెళ్లిన ఏవో శ్రీనివాస్‌రావు, చిట్యాలకు వెళ్లిన ఏఈవో అశోక్‌రెడ్డిని చిన్నమల్లారెడ్డి క్లస్టర్‌లోని నర్సన్నపల్లి, లింగాయిపల్లి, తిమ్మక్‌పల్లి, కోటాల్‌పల్లి, సరంపల్లి, పాతరాజంపేట గ్రామాలకు చెందిన రైతులు సన్మానించారు. ఏఏడీ అపర్ణ, ఏవో పవన్‌కుమార్, చిన్నమల్లారెడ్డి ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి, నర్సన్నపల్లి మాజీ సర్పంచ్‌లు ద్యాప హన్మాండ్లు, ద్యాప రాజు, వెంకట రాజయ్య, సింగిల్ విండో డైరెక్టర్ రాంరెడ్డి, రవి తదితరులున్నారు.

వీడీసీ స్థలాన్ని కాపాడుకుంటాం



వీడీసీ స్థలాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

భిక్కనూరు : రూ. 3 కోట్ల విలువైన భిక్కనూరు వీడీసీ స్థలాన్ని అక్రమించుకున్న కబ్జాదారులు వెంటనే ఆ స్థలాన్ని విడిచి వెళ్లాలని లేకపోతే చర్యలుంటాయని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. బుధవారం మాజీ వైస్ ఎంపీపీ తాటిపాముల లింబాద్రి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు అందే దయాకర్‌రెడ్డి, విండో చైర్మన్ గంగ్గుల భూమయ్య, నేతలు మైపాల్‌రెడ్డి, దుంపల మోహన్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ పార్టీలకతీతంగా కబ్జాకు గురైన వీడీసీ స్థలంను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తుందన్నారు. కాంగ్రెస్ వారయితే సలహాదారు షబ్బీర్‌అలీకి ఫిర్యాదు చేస్తామన్నారు. వీడీసీ స్థలాన్ని భిక్కనూరు ప్రజలంతా కలిసి కొనుగోలు చేశారన్నారు.

ఘనంగా బగళాముఖి జన్మదిన వేడుక



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో బగళాముఖి అమ్మవారి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బాద్రపద మాసంలోని అష్టమిని పురస్కరించుకుని అమ్మవారికి జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్ అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు.

స్నేహితుడికి ఆర్థికసాయం

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రానికి చెందిన చాప్ల సంతోష్‌కు ఆయన స్నేహితులు బుధవారం రూ. 50వేల ఆర్థికసాయం అందజేశారు. సంతోష్ పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. అయితే వారం రోజుల క్రితం ఆయన పెద్దకూతురు డెంగీతో మృతి చెందారు. కూతురు చికిత్స కోసం సంతోష్ రూ.10 లక్షలు అప్పు చేసి వైద్యం చేయించినప్పటికీ ఆమె బతకలేదు. ఆర్థికంగా బ్బందుల్లో ఉన్న ఆయనకు 1997–98 బ్యాచ్ స్నేహితులు ఆర్థికసాయం చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యురాలు సుప్రియ వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. వారం క్రితం 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సిద్దేశ్వరి డెంగీతో మృతి చెందడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాగిణి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

జీవాలకు టీకాలు వేయించాలి

దోమకొండ : మండల కేంద్రంలో 4,795 గొర్రెలకు బుధవారం టీకాలు వేసినట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన జీవాలకు టీకాలువేసి మాట్లాడారు. గొర్రెల పెంపకందారులు ఖచ్చితంగా పారుడు వ్యాధి టీకాలను వేయించుకోవాలన్నారు. మండల పశువైద్యాధికారి శివ, పశువైద్య సిబ్బంది రమేష్, పశు పెంపకందారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు అవగాహన



పిట్లం(జుక్కల్) : మండలంలోని రాంపూర్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్‌లో బుధవారం ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీలత మాట్లాడుతూ ఎస్‌ఏఎస్ పరీక్ష నిర్వహణ, మధ్యాహ్న భోజనం వివరాల ఎంట్రీపై అవగాహన కల్పించారు. కాంప్లెక్స్ సెక్రటరీ నార్య, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

గుంతల పూడ్చివేత



బాన్సువాడ : ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గుంతలను బుధవారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఇన్‌చార్జి కమిషనర్ శ్రీహరిరాజు పూడ్చివేయించారు. గణేశ్ నిమజ్జనం దృష్టిలో ఉంచుకుని గుంతలను పూడ్చి వేయిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపై గుంతలు ఉన్నట్లు ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే పూడ్చివేయిస్తామని అన్నారు. కౌన్సిలర్లు కిరణ్, హకీం, నాయకులు ఎజాస్, ఇలియాస్, రమశ్, సిబ్బంది హన్మాండ్లు, సతీష్ తదితరులు ఉన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాసుల బాల్‌రాజ్



బాన్సువాడ : తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌ను బుధవారం ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌కు వెళ్లిన వారిలో బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, వర్ని, కోటగిరి, రుద్రూర్, చందూర్, మోస్రా, పోతంగల్ మండలాల నాయకులు తదితరులున్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి



మాచారెడ్డి : విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించే విధంగా విద్యాబోధన చేయాలని పాల్వంచ, మాచారెడ్డి మండలాల నోడల్ అధికారులు జెతాలాల్, దేవేందర్ రావు సూచించారు. బుధవారం నిర్వహించిన పాల్వంచ, మాచారెడ్డి కాంప్లెక్స్ సమావేశాలలో మాట్లాడారు. ఎఫ్‌ఎల్‌ఎన్, ఎస్‌ఏఎస్ పరీక్షల కోసం పాఠశాల స్థాయిలో సామర్థ్యాల వారిగా అభివృద్ధి చేయాలన్నారు. కాంప్లెక్స్ సెక్రెటరీ సునీత, అశోక్ మండల ఆర్పీలు శ్రీనివాస్, అర్చన, రమ్య, సీఆర్పీ నరేష్ తదితరులున్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక



మాచారెడ్డి : పాల్వంచ మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్తిగారి లక్ష్మి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కొంగల భూమేష్, ఉపాధ్యక్షులుగా చింతకింది దేవేందర్, గుండెల్లి రాజమల్లు, ప్రధాన కార్యదర్శిగా దోమకొండ స్వామి, అధికార ప్రతినిధిగా శంకర్ బాబు, కోశాధికారులుగా నిమ్మ శివరాజు, కోలపురం ఎల్లయ్య, గౌరవ అధ్యక్షునిగా గుండెలి పెద్దకాశిరాంలను ఎన్నుకున్నారు.

జీపీ రికార్డుల పరిశీలన

నస్రుల్లాబాద్ (బాన్సువాడ) : మండలంలోని బస్వాయిపల్లి జీపీని బుధవారం ఎంపీడీవో సూర్యకాంత్ పరిశీలించారు. గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, మంచినీటి సరఫరా చేసే వాటర్ ట్యాంకులను పరిశీలించారు. ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శి సాయిలును ఆదేశించారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు

బాన్సువాడ రూరల్ : మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. మూణ్నెళ్లుగా గ్రామంలో విషజ్వరాలు, చికున్‌గున్యా వంటి రోగాలు ప్రబలడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఉన్నతాధికారుల సూచన మేరకు శానిటేషన్, క్లోరినేషన్ చేస్తున్నట్లు కార్యదర్శి పేర్కొన్నారు.

అర్హులకు రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ భూమయ్య

భిక్కనూరు : అర్హులందరికీ ప్రభుత్వం వెంటనే రుణమాఫీ పథకంను వర్తింపజేయాలని భిక్కనూరు సింగిల్‌విండో పాలకవర్గం సభ్యులు తీర్మానించారు. బుధవారం విండో చైర్మన్ గంగ్గుల భూమయ్య అధ్యక్షతన సమావేశమైన పాలకవర్గం సభ్యులు రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విండో చైర్మన్ గంగ్గుల భూమయ్య మాట్లాడుతూ భిక్కనూరు విండో పరిధిలో 391 మంది రైతులకు ఇప్పటి వరకు రూ.29,32,34,000 మాఫీ అయ్యాయన్నారు. నూతనంగా ఇటీవల 85 మందికి కొత్తగా రుణాలను మంజూరు చేశామన్నారు. అలాగే సింగిల్‌విండో ఆధ్వర్యంలో గాంధీచౌక్ సమీపంలో నిర్మించిన ఐదు షట్టర్లను అద్దెకు ఇచ్చేందుకు తీర్మానించామన్నారు. ఆసక్తికలవారు ఈనెల 12వ తేదీనుంచి దరఖాస్తు చేసుకోవాలని, షట్టర్‌కు రూ. 5వేలు అద్దె అడ్వాన్స్‌గా రూ. 50 చెల్లించాలన్నారు. సమావేశంలో విండో వైస్‌చైర్మన్ ముచ్చర్ల రాజిరెడ్డి సీఈవో నర్సింలు, డైరెక్టర్లు మైపాల్‌రెడ్డి, అంబల్ల మల్లేషం, మద్దురి నర్సింలు తదితరులున్నారు.

సొసైటీల్లో రికార్డుల తనిఖీ



బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని పుల్కల్ సొసైటీలో బుధవారం మానిటరింగ్ అధికారి లక్ష్మీనారాయణ రికార్డులు తనిఖీ చేసి సొసైటీ సిబ్బంది, రైతులతో మాట్లాడి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలో రూ. 25 లక్షల అక్రమాలు జరిగాయి, బిల్లులివ్వకుండా ఎరువులు విక్రయిస్తున్నారని వచ్చిన ఆరోపణలపై జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రికార్డులు తనిఖీ చేశామన్నారు. సొసైటీకి లాభం వచ్చే విధంగా చూడాలని సిబ్బందిని సూచించామన్నారు.

నాణ్యమైన విద్యను బోధించాలి



నిజాంసాగర్(జుక్కల్) : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వృత్తినే దైవంగా భావిస్తూ నాణ్యమైన విద్యాబోధన చేపడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రుల మన్నలు పొందాలని ఎంఈవో దేవిసింగ్ అన్నారు. బుధవారం మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు, స్థానిక ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దఫేదార్ వెంకన్న పీఆర్టీయూ నాయకులు నారాయణ తదితరులున్నారు.

లక్ష్యానికి మించి సభ్యత్వం నమోదు చేయాలి



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డి: లక్ష్యానికి మించి బీజేపీ సభ్యత్వ నమోదవుతోందని బీజేపీ పార్టీ అధ్యక్షురాలు అరుణతార అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో పార్టీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో లక్ష్యానికి మించి బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదులు అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు తదితరులున్నారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి : సభ్యత్వ నమోదులో ఉమ్మడి మాచారెడ్డి మండలం ముందుండాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్ జైన్ అన్నారు. బుధవారం మాచారెడ్డి, పాల్వంచ మండల కేంద్రాల్లో ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 88000 02024కు ఫోన్ చేసి స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాచారెడ్డి, పాల్వంచ మండల అధ్యక్షులు సురేష్, అనిల్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, సీనియర్ నాయకుడు వెంకట్ రెడ్డి ఉన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



కామారెడ్డి రూరల్ : సమాజంలో మంచి సేవలతోనే గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో నాగవర్ధన్ అన్నారు. బుధవారం క్యాసంపల్లి గ్రామంలో పని చేసి బదిలీపై రాజంపేట మండలం తలమడ్లకు వెళ్లిన యాదమ్మను మాజీ పాలకవర్గం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. మాజీ సర్పంచ్ సందిరి మంజుల నారాయణరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బాలకిషన్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కోరంద భాగ్యలక్ష్మి రాజిరెడ్డి, భూమని బాల్‌రాజు, గ్రామ కార్యదర్శి సౌమ్యరెడ్డి తదితరులున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలసి ఉండి పార్టీని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరడ్‌పల్లిలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సమస్యలు విన్నవిస్తే ఎమ్మెల్యే మదన్‌మోహన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాజు, మురళిమోహన్, షౌకత్‌అలీ, అఖిల్‌రావు, లక్ష్మణ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15 వరకు ఇంటర్ ప్రవేశాలకు గడువు



మాట్లాడుతున్న ఇంటర్ నోడల్ ఆఫీసర్ షేక్ సలాం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఈనెల 15 వరకు గడువు ఉన్నట్లు జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులతో సమస్యలపై బుధవారం మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో ఇంటర్ ఫస్టియర్‌లో 2300 మంది, సెకండియర్‌లో 2400 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పడిన నాగిరెడ్డిపేట, బీబీపేట, నిజాంసాగర్, బీర్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ ల్యాబ్‌లకు సంబందించిన సామగ్రి మంజూరైందన్నారు. కళాశాలల్లో అధ్యాపకుల కొరతకు సంబందించి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగయ్య తదితరులున్నారు.

చిన్నారులకు ఫిజియోథెరపి



ఫిజియోథెరపి చేస్తున్న వైద్యుడు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి భవిత కార్యాలయంలో బుధవారం ఫిజియోథెరపి క్యాంప్ నిర్వహించారు. అంగవైకల్యం ఉన్న చిన్నారులకు ఫిజియోథెరపి వైద్యులు డాక్టర్ అరుణ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశం, శివకుమార్ తదితరులున్నారు.

సంక్షిప్తం

954 జీవోను రద్దు చేయాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 954 జీవోను రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంఘం రీజినల్ కార్యదర్శి శ్రీరాం అన్నారు. బుధవారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులతో కలిసి డీఈ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. జీవో రద్దయ్యేంతవరకు పోరాడుతామన్నారు.

నటేశ్వర శర్మ మృతికి బ్రాహ్మణ పరిషత్ సంతాపం

కామారెడ్డి అర్బన్ : దాశరథి పురస్కార గ్రహీత, ఆధ్మాతిక, ధార్మిక సాహితీ వేత్త, నిరాడంబరుడు బ్రాహ్మణ బంధువు అయాచితం నటేశ్వరశర్మ భౌతికంగా లేనిలోటు పూడ్చలేనిదని బ్రాహ్మణ సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌శర్మ, సలహాదారుడు అర్జున్‌రావు, బ్రాహ్మణ వికాస పరిషత్ జిల్లా మాజీ అధ్యక్షుడు వైద్య కిషన్‌రావు సంతాపం తెలిపారు.

కంటి వైద్య శిబిరం సక్సెస్

భిక్కనూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. కంటి వైద్యుడు రవీందర్ పటేల్ 154 మందికి కంటి పరీక్షలు చేశారు. కంటి వైద్యుడు రవీందర్ పటేల్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరెళ్లకొకసారి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

దేవునిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో..

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం శివసాయి డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ కీర్తి పాఠశాలలోని 380 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం గంగాకిషన్, వైద్య సిబ్బంది సయ్యద్ జాఫర్, సుప్రజ తదితరులున్నారు.

పిట్లం(జుక్కల్): కామారెడ్డి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో 100 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షల నిర్వహించినట్లు వైద్యుడు ముజమ్మిల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు అర్జున్, సిబ్బంది, టీచర్లు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం ఆర్థికసాయం

బాన్సువాడ : వరద బాధితుల కోసం తమ వంతుగా బీర్కూర్ వెంకటయ్య క్యాంప్‌నకు చెందిన కామినేని సుజాత, విజయ్‌కుమార్, దత్తులు రూ. 10 వేలను చెక్కు రూపంలో ప్రభుత్వానికి ఆర్థిక సాయం పంపించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చెక్కును వారు పంపించారు.

పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే

పిట్లం(జుక్కల్) : పిట్లం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగండ్ల బాల్ రెడ్డి అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. బుధవారం నిర్వహించిన అంత్యక్రియల్లో ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొని అంతిమ వీడ్కోలు పలికారు. జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అంత్యక్రియల్లో పాల్గొని బాల్ రెడ్డి పాడే మోశారు.

నిజాంసాగర్(జుక్కల్) : ఉమ్మడి నిజాంసాగర్ మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ తల్లి సాదుల గంగమణి బుధవారం మృతిచెందారు. జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే, మాజీ జెడ్పీచైర్మన్ దఫేదార్ కొమలంచ గ్రామానికి వెళ్లి అంత్యక్రియల్లో పాడె మోశారు.

లయన్స్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాల పంపిణీ

మద్నూర్(జుక్కల్) : మండలంలోని లచ్చన్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం బిచ్కుంద లయన్స్ క్లబ్ సేవ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్‌ను పంపిణీ చేశారు. అధ్యక్షుడు మారుతి, రీజినల్ చైర్మెన్ ప్రకాష్, జోనల్ కార్యదర్శి విక్రమ్ తదితరులున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: డి. యల్. ఎన్. గౌడ్ : 6300453108
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899